# 'దిగాలుగా వచ్చిన ఉగాది'

రాత్రి పదిన్నర ప్రాంతం...

మా క్యాంపు లొకాలిటీ మొత్తం నిశ్శబ్దంగా వుంటుంది.

బైట మోటార్సైకిలాగినచప్పుడు...

వచ్చింది శీను... శ్రీనివాసరెడ్డి...

శీను రైతు బిడ్డ. మట్టి మనిషి. నాగలి పట్టి పొలం దున్నినవాడు.

పాడీపంటా పోయింతర్వాత మొన్నటిదాకా విత్తనాలు, ఎరువులూ, పురుగుల మందులూ అమ్మేవాడు.. సీమరైతు కరవు కోరల్లో చిక్కుకోడం కొత్తేమీ కాదు.. కానీ ఈ మాటు కరవు సీమ రైతును సాంతం మింగేసిన విషయం ప్రభుత్వానికే కాదు ప్రపంచ బ్యాంకుకు కూడా తెలుసు.

రైతే లేనప్పుడు విత్తనాలెందుకు? ఎరువులెందుకు?

పురుగుల మందు మాత్రం అవసరంలెండి.

అందుకని వట్టి పురుగుల మందు అమ్మితే నరహంతకుడినే తాననుకుని శీను దుకాణమే మూసేసాడు.

ఇప్పుడు మా కృష్ణమోహన్ హాస్పిటల్లో రిసెప్షనిస్టుగా బతుకు వెళ్లదీస్తున్నాడు.

ఆ శీను... ఒకప్పటి రైతు డిపో శ్రీనివాసరెడ్డి ఇంత రాత్రప్పుడెందుకొచ్చుంటాడూ అన్న ప్రశ్న...

అందునా వాడి దగ్గర కాదంబరీ పరిమళం గుప్పుమంటోంది.

బాగా 'హై'లో వున్నాడు.

డిగ్రీ వరకు చదివిన శీను బైటి ప్రజల్తో ఎట్లా మాట్లాడినా మా దగ్గర మాత్రం పచ్చి కర్నూలు యాసతో మాట్లాడ్తాడు. నన్ను నోరారా 'అన్నా' అని పిలుస్తాడు.

"ఇంగా లైటుంటే పోతాపోతా సూచొచ్చినన్నా" అన్నాడు.

"బాగా టైట్‌గా వున్నావు కదరా బండి ఎందుకు నడుపుతున్నావు?" అడిగా..

"సచ్చే మాత్రమేమ్లేనా... సూచ్చివా అప్పుడే ఉగాదొచ్చె" అన్నాడు.

చెప్పు అన్నట్లు చూసా... ఆపకుండా మాట్లాడసాగాడు శీను.

"ఊరి కాడికి బోయింటినా... వూరా వొల్లకాడా... గడ్డి పరకల్యా... పసరాలకి దూపకి నీల్లుల్యా రైతులెల్ల కూలినాల్లకి బోతావుండారు... తమ్ముడోదిక్కు అన్నోదిక్కు అయ్యో

దిక్కు పట్టి పాతా వుండారు. ఉగాదొచ్చెగదూ మా ముసిలోన్ని కర్నూలుకు రమ్మంటే ఆ ఎండిన సెక్కను గర్చుకోని పల్లిడిసి రానని బిగదీసుకోనున్నాడు...

మా బుంగావునా అది మా యమ్మ... బోడి గొమ్ములోడు నా తమ్ముడనా... మిగిలిన ఆ రెండు పసరాలికి గాసం లేక కటికోని కమ్మి పార్నూకినా రెండూ మూసుకోని గమ్ము నుంటి గదనా... ఈ దినం ఉగాదు గాదికీ వూరల్లా పూతిచ్చే యాపసెట్టనా... మా యింటి దేవతన్నా ఎల్లమ్మ తల్లి. ఎంత సెట్టనా నేనూ మాయన్నా యిద్దరం సేతులు గల్పినా సాలని యాపసెట్టనా దాన్ని కొట్టొచ్చి పార్నూకినాడు మా ముసిలోడు...

ఏంటికి నాయినా ఎల్లమ్మను గొట్టిచ్చి నవంటే 'గడ్డిత్తనాలు గొన్నీకె' అంటాడన్నా. ఏంటికినా ఉగాది? ఏం ఉగాదనా యిది"

ఆగాడు ఆవేదనతో శీను.

మట్టిని బంగారంగానూ, చెట్టును దేవతగానూ చూసే రైతు ఆవేదన అది.

కాసేపాగి మళ్లీ మొదలుపెట్టాడు శీను.

"అయిపాయనా అంతా అయిపాయ... ఆ దినాలల్ల ఉగాదొచ్చెనంటే ఎట్టుం ట్యాండనా పొద్దుగాల సీకట్ల లేసి ఎద్దులకు బుంగల్లోని నీల్లు పోసి సానాలు చేయించి, ఓడు కొమ్ములకు అందెం (ఆముదం) పూచ్చె, ఇంగోడు రంగులేసేది.

మువ్వలేంది. గంటలేంది. కుచ్చులంట, బొడ్డార్లంట

కొత్త సెర్నాకోల్లు, కొత్త నాగల్లు, కొత్త పగ్గాలు, కొత్త మోకులు, గడెం గట్టినెంక ఆంజినేయసామి గుల్లో అయివోరు పంచాంగం సదివితే యిని, అమ్మయ్య (పూజారి భార్య) పెట్టిన యాపూత పెసాదం దినేది... ఇండ్లల్ల సిత్రాన్నాలు కడుముల్తోని అన్నాలు.. యిల్లిల్లూ యిరగబూసిన తంగెడు సెట్టు లెక్క వుండేటిది... ఇదేం ఉగాదినా..."

సీమ రైతులందరూ కలిసిపోయి శీనుగా అవతరించినట్లనిపించింది నాకు.

వెళ్తానని లేచి మళ్లీ ఆవేశంగా

"కరువు కరువో అని కడగండ్ల బాలై సచ్చాంటే వడగండ్ల వానొచ్చె... మ్యాక సచ్చె, గొర్లు సచ్చె, పాసు లెక్కున్న పంట సచ్చె, సెట్టిరిగిబడి గుడిసెలు కూలి సెచ్చె ఇంగేం ఉగాదినా"

వాడి కళ్లు తడితేరి వున్నాయి.

ఎప్పుడో మిత్రుడు మౌళి ఉగాది కవిత ముందు రెండు మాటలు గుర్తొచ్చాయి.

'ఉగాదొచ్చె ఉగాదొచ్చె
ఎగాదిగా సూడండహో'

* * *

***తిథులూ, వారాలూ, తారీఖులు పండగలు కాదు...***
***మనసునిండుగా ఆనందమున్నప్పుడే పండగ.***[1]